# నేను లేచిపోయాను

మోహన్-కిరణ్

సావిత్రీ!

ఇన్నాళ్ళ తర్వాత ఇన్నేళ్ళ తర్వాత నాకు మళ్ళీ ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. అయితే ఈ మధ్య కాలంలో నీ దగ్గరనుండి రెండు మూడు ఉత్తరాలు వచ్చినప్పటికీ సమాధానం వ్రాయాలనిపించ లేదు సావిత్రీ! ఎందుకో తెలుసా?

లోగడ నేను వ్రాసిన ఉత్తరంలో నేను ఎప్పటికయినా ఎవరితోనయినా లేచి పోవటం జరుగవచ్చునని ఆ రోజుకొరకు ఎదురు చూస్తున్నానని వ్రాశాను. నా ఉత్తరానికి సమాధానంగా నీవు రాసిన పెద్ద ఉత్తరం చదువుకొన్నాను. అందు కనే ఆనాడు లేచిపోయిన తరువాతనే నీకు ఉత్తరం రాద్దామని నీ నుండి నా తో షాన్ని పంచుకుందామనీ ఇంతకాలం రాయలేకపోయాను సావిత్రీ!

నన్ను లేచిపొమ్మని నీవు రాసిన తరు వాత నా జీవితంలో తారసపడ్డ వ్యక్తులు నా జీవితానికి సంబంధించినంత వరకు మధు, రామారావులు ఇద్దరి విషయంలో కూడా నేను ఎంచుకున్న తీరులో పొర పాటుపడినట్లు వ్రాశావు నేను లేచిపో దలచుకొన్నప్పుడు మధుతో, రామారా వుతో పెళ్ళిప్రసక్తి ఎందుకు తెచ్చావని వ్రాశావు కాగా యిద్దరూకూడా వ్యక్తి గత ప్రతిబంధాలకు, సాంఘిక కట్టుబా ట్లకు లోనయి గానుగ ఎద్దుల్లా ఒకే పరిధిలో పరిభ్రమించేవారు అలాంటి వ్యక్తులను 'నీ ఆశయంకోసం, కాదు, ఆశ, వాంఛలకోసం ఎన్నుకోవటం పొర పాటని వ్రాశావు

ఒకరు భవిష్యత్తును గురించి కన్నుల కలలు కంటూ హోదా [illegible] ధనం, కట్టాలనే ఆలోచన [illegible] స్వార్థ పూరితంగా ఆలోచించుకునే బ్రహ్మచారి అయితే, మరొకరు సంసారం బాధ్య తలు సాంఘిక వ్యవస్థలకు లోనై విస్సి పోయి స్థితిలో వున్న సహోద్యో యుడు. ఈ ఇద్దరిలో ఎవరు నీ పరిస్థితు లను నీ సంక్షోభాన్ని నీ అంతర్యంలో చెలరేగే అంతర్యుద్ధాన్ని గురించి ఆలో

చించగలరు? ఆలోచించేతీరిక, ఆస్కారం అసలు వాళ్ళకెందుకుంటాయి! అంతేకాదు. ఏనాటికైనా నీ ఆశలు నెరవేరాలంటే నీవు ఒక అంతస్తు క్రిందకు దిగాలి- నీ పట్ల నీ వ్యర్థ జీవితంపట్ల సానుభూతి చూపి ఆదుకోగలిగిన వ్యక్తి కనిపించితే నీకై నీవు ఆత్మార్పణం చేసుకోగలిగితే నీ వాంఛ తీరకపోదు. ఇప్పటికయినా లేచిపోవాల్సిన రోజు వచ్చిందికదా అని సంతోషపడవలసిన రోజు రాకపోదు'' అని ఇంకా ఏమేమో చాలా రాశావు.

నీ పెద్ద ఉత్తరం చదువుకున్నమీదట అంతకుముందు నాలో ఏ మూలో దాగివున్న ఆశ. కోరిక మటుమాయమయినాయి. నీ ఉత్తరం వచ్చిన రోజు రాత్రంతా నిద్రపట్టలేదు. నాలో నేను అనేక రకాలుగా మదనపడ్డాను. బరువుగా! పేలవంగా తెల్లవారింది.

నా ఆలోచనలతో బాధలతో బరువెక్కిన కళ్ళను పాలిపోయిన ముఖాన్ని దొడ్లోకి పోయి కడుక్కున్నాను. తిరిగి జీవితంలోకి ప్రవేశించి పెదవి మీదకు మామూలు చిరునవ్వును తెచ్చుకోవడం జరిగింది.

ఏ రోజూ నా బాగోగులను గురించి అడగని అమ్మగూడా ఆ రోజు ఇంటి పనులు చేసుకోవడం కొంచెం ఆలస్యమయిందో ఏదో "పిల్లలను స్కూలుకు ఇంతవరకు పంపలేదు వాళ్ళు తిండికి లేక పిల్లలను నీ దగ్గర వదిలాననుకున్నావా? ఏదో చదువుకున్న దానివి, మంచి పద్ధతులతో విద్యాబుద్ధులు నేర్పుతావని ఇక్కడకు పంపారుకాని విన్నా దేవిరించుకుందామనికాదు. తెల్లవార్లూ ఏం సాటుపడ్డావేమిటి? మొహం అలా పీక్కుపోయింది'' అని విసురుగానే అంది.


ఇంక అక్కడ ఉండ మనస్కరించక త్వరగా పనులు ముగించుకొని. డ్రస్ చేసుకొని స్కూలుదారిపట్టాను. అమ్మమీదున్న ఏ కొద్దిపాటి ప్రేమా, గౌరవమూకూడా పోయాయి.

నే నెందుకు బ్రతకాలి? ఎవరికోసం ఏం సాధించాలని? ఏ ఆత్మహత్యో చేసుకుంటే తీరిపోతుంధనికూడా అనిపించింది. అయినా చేసుకొనేది నా జీవితంలో ఇలాటిరోజు వస్తుందనేనేమో?

తిరిగి నా జీవితం యంత్రమైపోయింది. నా ఇంటిపనులు. స్కూలుకు వెళ్ళడం. ముఖ్యంగా అక్కడ పనులు ముగించుకొని ఇంటికిరావడం. ఏ వన్నట్లునా ఇంట్లో వాళ్ళందర్నీ మరింత సోమరులుగా తయారుచేయడం ఇలా సాధారణ చర్య అయిపోయింది నా జీవితం.

ఈ పరిస్థితులలో నీకు ఎలా ఉత్తరం వ్రాయగలను సావిత్రీ! నా దైన్యస్థితికి ఏడుద్దామన్నా కంటికి నీరుకూడా రాలేదు జీవితంలో నేనొక జడపదార్థాన్ని సావిత్రీ జడపదార్థాన్ని.

ఒకరోజున స్కూల్లో రామారావు కనబడి ''జానకీ! ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ




అన్యమనస్కంగా. అలసటగా ఉంటు న్నావు. ఏమిటి సంగతి?'' అనడిగాడు.

ఏమని సమాధానం చెప్పను. విందుగా సంతోషంగా వున్నానని చెప్పనా! కానీ చివరికి ఏమన్నానో తెలుసా?

''ఎదుట వున్న ఆడదాని అంతర్యం తెలిసుండీ. మనసులో ఏదో కోరిక ఉండి కూడా ఒక్కడుగు ముందుకురాలేక పిరికి పందల్లా రామారావుల్లా పారిపోయే మగ ధీరులుకాదు అందరూ.''

అంతే! మళ్ళా తరువాత రామారావు నాతో మాట్లాడలేదు. మధు అంతకు ముందే లేడు.

నా జీవితానికింతే అనుకున్నాను. రోజూ స్కూలుకు వెడతాను. అక్కడొక టైమ్‌టేబుల్ ఉంటుంది. ఏ పీరీయడ్‌లో ఏ క్లాసులో ఏ సబ్జక్టు చెప్పాలో దానిలో వుంటుంది. ఏ పాఠం చెప్పాలో సిలబస్‌లో ఉంటుంది. తరువాత నాకు కూడ మరొక టైమ్‌టేబుల్ ఇంటి దగ్గర వుంటుంది. ఏ సమయంలో ఎవరెవరికి ఏమేమి ఎలా అమర్చిపెట్టాలో అని. అయితే స్కూల్లో టైమ్‌టేబుల్ కాగితం మీద వ్రాసివుంటుంది. ఇంటిదగ్గిర టైమ్‌టేబుల్ దేనిమీదా వ్రాసివుండదు. కాని ఇంటిదగ్గర పర్మిషన్ తీసుకొని క్లాసుకు వెళ్ళకుండా మానేయవచ్చు. కానీ ఇంటి దగ్గిర ఇలామానేసినరోజు పెద్దయుద్ధమే.

అంతే సావిత్రీ! మరి అంతే!! నాకు హృదయంలేదు. కోరికలు లేవు. ఇష్టా యిష్టాలు లేవు. అవును. నేను. నేను ఒక జడపదార్థాన్ని సావిత్రీ!

ఇలా నిరర్థకమైన వ్యర్థ జీవితాన్ని గడుపుతున్న సమయంలోనే నాకు 'ఓరియంటేషన్' ట్రయినింగ్‌కు సీటు వచ్చింది. స్థలం మార్పుతో, నా లోగడ టైమ్‌టేబుల్ మార్పుతో నామీద తొలకరి చినుకులు పడినట్లయింది.

ట్రయినింగ్‌లో నేను, లక్ష్మి సన్నిహితంగా వుండేవాళ్ళం. మా యిద్దరి మధ్య దాపరికాలుండేవి కావు. నా పరిస్థితంతా అవగాహన చేసుకున్న లక్ష్మి ఎంతో సానుభూతి చూపింది. అప్పుడు నా హృదయం ఎంత తేలికపడిందను కున్నావు సావిత్రీ! నిజంగా నాకు ఆ మాత్రం సానుభూతి నీ నుండి మొదట్లోనే పొందగలిగితే నాలో ఈ అంతర్యుద్ధం చెలరేగేదికాదు.

ఒకరోజు లక్ష్మి బాత్‌రూంలో స్నానం చేస్తుండగా లక్ష్మికోసం ఎవరోవచ్చారు. కూర్చోమని కుర్చీ చూపించాను. వచ్చిన వ్యక్తిని చూస్తూనే ఒకరకమైన గౌరవ భావమేర్పడిపోయింది నాలో. ఖద్దరు పంచె, లాల్చీ వేసుకొని హుందాగావున్న వ్యక్తిని చూస్తూనే ఏ రాజకీయ నాయకుడో, కార్యకర్తో కావచ్చు అనుకున్నాను అయినా ఇలాంటివారితో లక్ష్మికి ఏం పని వుంటుదబ్బా అనుకుంటూ ఆశ్చర్యంతో-

"ఏ పనిమీద వచ్చారు?" అని అడిగాను.

"లక్ష్మిగారు లేరాండీ?"

"ఉన్నారులెండి. అయినా పనేమిటో నాతోకూడ చెప్పవచ్చులెండి."

"అబ్బే! చెప్పకూడదని కాదనుకోండి అయినా ఆమెగారున్నారుగా, రానివ్వండి"

ఇంతలోనే స్నానం ముగించుకొన్న లక్ష్మి హాల్లోకి వచ్చి ఆయనను చూసి- "హలో! ఎంతసేపయింది వచ్చి?" అంది.

"ఏమిటోయ్ లక్ష్మీ! నాకు తెలీనిరహస్యాలు" అన్నాను తెచ్చిపెట్టుకున్న కోపంతో.

"కాదు జానీ! నీకు తెలీకుండా ఏ విషయమైనా దాస్తానా?"

అందరూ నన్ను జానకీ అని పిలిచే వారు లక్ష్మిమాత్రం ఎప్పుడూ జానీ అని పిలుస్తుండేది అలా పిలిచినప్పుడల్లా ఏదో ఒకరకమైన ఆత్మీయత, అనురాగం, సాన్నిహిత్యం పలకింప చేసేవి.

లోగడ నీకు చెప్పానే నేను ఉత్తరం వ్రాశానని. వస్తారని చెప్పానే ఆయనే ఈయన పేరు శివరామ్" అంది లక్ష్మి.

"నమస్కారమండీ." మృదువుగా చెప్పాను.

ప్రతి నమస్కారం చేశాను యాంత్రికంగా. సభ్యత, సంస్కారం ఉట్టిపడుతున్నట్లున్న ఆ మనిషిని చూడగానే ఎవరికైనా మంచి అభిప్రాయం ఏర్పడుతుందనిపించింది.



అయితే నన్ను చూడగానే అతడికి కలిగిన అభిప్రాయం వేరు. ''ఆ ముతక నేతబట్టలు. వెడల్పుగా గుండ్రంగావున్న బొట్టు. ముక్కుకి పోగు అమ్మమ్మలా ఈ రోజుల్లోకూడ ఈ అవతారం ఏమిటి! అని లక్ష్మితో అన్నాడట.

లక్ష్మి నన్ను గురించి అంతా చెప్పిం దట. వెంటనే ''ప్చ్! ప్చ్!! అంతే లక్ష్మీ! హృదయాన్ని అర్థం చేసుకొని, ఆత్మార్పణం చేసుకొనే స్త్రీని ఎవరాధరిస్తు న్నారీ రోజుల్లో. ఫాషన్ పెరేడ్‌లో వేషా లను అనుకరిస్తూ బాహ్యడంబరం వున్న వాళ్ళంటేనే మగవాళ్ళకుకూడా మోజు ఎక్కువయింది. అంతవరకు ఎందుకు? మొట్టమొదట నాకు వచ్చిన భావం ఎలాం టిది? నిజంగా ఆ అవకాశం. సమయం వచ్చిన రోజున ఎండిమోడయిపోయిన జానకిగారి జీవితంలో తిరిగి వసంతం

రావడంకోసం ఏమి చేయడానికయినా. ఎంతటి త్యాగానికయినా వెనుకాడను" అన్నాడట.

చివరకు వెడుతూ "వస్తానండి జానకి గారూ! లక్ష్మిద్వారా మిమ్మలను గురించి అంతా తెలుసుకోలేకపోయినప్పటికి కావలసినదానికన్నా ఎక్కువగానే తెలుసుకున్నాను. మీలో మీరు ఎంత సంక్షోభపడినా. మరీ అంత బేలతనం పనికిరాదు. ఎంత విరాశా నిస్పృహలతోవున్న వ్యక్తి అయినా చురుకుగా. ఉల్లాసంగా ఉండి తాపీగా నడుకోగలిగినప్పుడే ఎంతటి జటిల సమస్యనయినా పరిష్కరించుకోగలరు. నాలో నాకు ఎన్ని అగ్నిగోళాలు బ్రద్దలవుతున్నాయో మీరు ఊహించగలరా? ఎంతటి ఐశ్వర్యమైన జీవితం గడుపుతున్నానో నన్నుచూపి మీరు నిర్ణయించగలరా? ఎన్ని కష్టాలుంటేమాత్రం....? మీ జీవితాన్ని ఇతరులకోసం ఇంతకాలం హరింపుకుంటూ వచ్చారు. ఇక ముందయినా మీకోసంగూడ కనీసం కొంత ఆలోచించడం అలవర్చుకోండి. ఈసారి మిమ్మలను చూచేటప్పటికి ఈ నిర్లిప్తత. నిరుత్సాహం నాకు కనిపించ కూడదు. వస్తా. మరి శెలవు" అని వెళ్ళిపోయాడు.

ఆ మాట విన్న నాకు నా మీద అమృతవర్షం కురిపినట్లయింది. నిజానికి సావిత్రీ! ఆ రోజునుండి ఏదో ఒక రకమైన ఆత్మబలం నాకు చేకూరింది. అప్పటినుండి స్తబ్ధకగా ఉండలేకపోయేదాన్ని. ఎప్పుడూ ఏదో వ్యాపకం చూచుకొంటూ ఉల్లాసంగా ఉండేందుకు ప్రయత్నించేదాన్ని.

సంతోషం సగం బలమన్నట్లుగా. నా ఆవేదన కొంతలో కొంత ఉపశమించగానే నా రూపురేఖల్లో ఒక క్రొత్తరకమైన అందం కన్పిస్తోంది జానీ! అనేది లక్ష్మి.

ఇలా శివరామ్‌తో మొట్టమొదటిసారిగ పరిచయమయింది నిజానికి నా కప్పటికే Love at first sight అనే విషయంలో నమ్మకంపోయింది సావిత్రీ! నా జీవితంలో నేను తిన్న ఎదురుదెబ్బలే అందుక్కారణం కావచ్చు. కాని అతడినిచూడగానే నాకు కలిగిన భావాన్ని ప్రేమ అనే పదంతో అపవిత్రం చేయలేను. ఒకవిధమైన పూజ్యభావం. గౌరవం కలిగాయి. నిజానికి ఈ మాటలు నాభావాన్ని సరిగ్గా వ్యక్తంచేయలేవు. అదొక అవ్యక్తభావం. ధావినే ప్రేమ అని నీవంటే నే నే మీ చేయలేను సావిత్రీ!

మనలో మార్పు మనకంటే ఇతరులకు బాగా కన్పిస్తుంది. లక్ష్మి ఎప్పుడైతే నాలో మార్పు వచ్చిందని చెప్పిందో అప్పటినుండే అతడి రాకకోసం ఎదురు చూడటం సాగించాను. మధు, రామారావుల విషయంలో ఇలా జరగలేదని చెప్పగలను. వాళ్ళు రోజూ కన్పించటమే అందుకు కారణమేమో?

నాలో మార్పు అతడికి తెలియకపోయినా ఇంటిదగ్గరనుండి మాత్రం నాలో మార్పు గోచరిస్తోందంటూ ఉత్తరాలు రావటం మొదలయింది. నేను ప్రతినెలా ఇంటికి పంపే డబ్బు తగ్గడమే అందుకు కారణం నాకు వాళ్ళందర్నీచూసి వికటాట్టహాసం చేయాలనిపించింది.

ఇంతలో ఒకరోజు లక్ష్మి రెండు పుస్తకాలు తీసుకొని వచ్చి "జానీ! నీకు నవలలు చదవడం అలవాటులేదని నాకు తెలుసు. కాని ఇవిచదివి నీ అభిప్రాయం చెప్పు" అంది.

వాటిని అందుకొని చూశాను. రెండూ క్రొత్తగా అచ్చయినట్లున్నాయి. రచయిత ఎవరోనని చూశాను. రెంటి రచయితా ఒకరే. పేరు చెప్పనా సావిత్రీ! కిరణ్. ఆ పేరుకి ఎప్పటికీ కృతజ్ఞురాలినే. నిజానికా నవలలు నా జీవితంలో వెలుగు కిరణాలనే ప్రసరింపజేశాయి.

వాటి విశేషమేమిటో చెప్పలేదేమిటను కొంటున్నావా సావిత్రీ! చెబుతాను. అది చెప్పకపోతే నా జీవితంలో కలిగిన ప్రధాన మార్పే తెలియదు నీకు.

మొదటి నవల పేరు తెగిన తీగలు. పేరు చూడగానే నా జీవితం లాగానే ఉందే అనుకొన్నాను. కాని సావిత్రీ! అది నా జీవితానికి ప్రతిబింబం. దానిలో నాయకుడు లేడు. నాయికకు ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతుండగా తండ్రిపోయాడు. వెంటనే సెకండర్‌గ్రేడ్ ట్రైనింగ్‌కు వెళ్ళి టీచర్ ఉద్యోగం సంపాదించుకొంది. తమ్ముళ్ళను చెల్లెళ్ళను ఉద్ధరించుతావని పెళ్ళి మానేస్తుంది. చెల్లెళ్ళు ఎవరకు నచ్చిన వాళ్ళను వాళ్లు పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతారు. తరువాత వాళ్ళ పిల్లలను మళ్ళా అక్క దగ్గరకే చదువుకోసం పంపుతారు. తమ్ముళ్లు పెద్ద వాళ్ళవుతారు. వాళ్ళ పెళ్ళిళ్ళు జరిగిన దగ్గరనుండి ప్రారంభమవుతుంది అసలు కథ. నా ఇక స్థితి నానాటికి దిగజారుతుంది ఇంతవరకు ఏమైనా తేడా కన్పించిందా సావిత్రీ నా జీవితానికీ ఈ కథకూఇక్కడ వరకు ఇప్పటివరకు జరిగిన కథ. ఇక ముందుది రచయిత ఊహాగానం. దిగజారినస్థితిలో, పెరిగిన వయస్సుతో. తీరని ఆశలతో. తొలగని కోరికలతో. మనస్సుతో అశాంతితో అంతర్యుద్ధం సలుపుతూ బ్రతుకలేక ఆత్మహత్య చేసుకుందా నాయిక. నేనేదో ఉన్నతంగా ఉంటుందనుకొన్న నా భవిష్యత్తు నా కళ్ళకు కట్టినట్లు ముందే చూపించి చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొన్నటు కాక నేను మరో ఎదురుదెబ్బ తినకముందే నా కళ్లు తెరిపించినందుకే రచయితకు నా కృతజ్ఞతలు చెప్పాను సావిత్రీ!

బహుశా రెండవ నవల తీశాను. చెదరిన జీవితం. పేరు చూడగానే మొదటి నవలకు సంబంధం ఉంటేమో అనుకొన్నాను. కాని అది ఒక మగవాడి కథ.

జీవితంలో ఎదురైన ఎన్నో ఒడి దుడుకులను ధైర్యంతో ఎదుర్కొని ప్రశాంతంగా జీవించే ఒక ధైర్య వంతుడి కథ ఏమిటో నవలను గురించి చెప్పేది పోయి నేను మరో కథ వ్రాస్తున్నట్లుంది కదూ సావిత్రీ! ఏమిటో మరి. మనసులోని ఉద్వేగం ఆపకుండా ఇలా వ్రాయించు తోంది.

అది సాయం సమయం. సంధ్య అరుణకాంతులతో మనోహరంగా ఉంది. పచ్చగా ఏపుగా బరువుగా ఉన్న చేలు అలలలా కదులుతూ శరీరానికి హాయి కలిగిస్తున్నాయి. గో వు ల మ ం ద లు ఇంటికి వస్తూ లేపిన ధూళి అరుణ కిరణ కాంతిలో బంగారురజనులా మెరుస్తోంది. ఆ సమయంలో బడినుండి యింటికి వస్తూనే అలవాటుకొద్దీ తల్లిదగ్గర కెళ్ళాడు కుమార్.

అలా ప్రారంభమయిందా కథ వర్ణనల ననహ్యించుకొనే నేను ఆ వర్ణనకు లొంగిపోయాను. అందుకు కారణం రచనకంటే రచయితమీది అభిమానమే అని పిసంటే నేను కాదనలేను సావిత్రీ! అలా ప్రారంభమయిన కథానాయకుడి కథ సవతి తల్లిరావటం. తండ్రిపోవటం కష్టాలనుభవిస్తూ పెద్దవాడై తల్లిని, తమ్ముళ్ళను ఆదరించడంతో విశ్రాంతికి చేరుకొని. కోరి చేసుకున్న భార్యను గుర్తుగా ఇద్దరు పిల్లలను మిగిల్చి మరణించడం. నాయకుడు పిల్లలను. తమ్ముళ్ళనీ. తల్లినీ పోషిస్తూండడంతో తారాస్థాయిని చేరుకొని చివరిపేజీని చూపి అసంపూర్తిగా ఆపివేయబడింది.

ఇదీ సాధారణ నవలేనని నీ వనవచ్చు సావిత్రీ! కాని అలా వరుసగా ఎదురు దెబ్బలు తిన్న నాయకుడి కథకు నా జీవితంతో సంబంధం ఉండడంచేత నేమో చాలా బాగుందనిపించింది:

ఒక ఆదివారం లక్ష్మి వచ్చి "జానీ! ఈరోజేదో మంచి ఇంగ్లీషు పిక్చరుందట. మార్నింగ్‌షోకు వెళ్ళివస్తాను" అని చెప్పి వెళ్ళిపోయింది. పాపం. ఎంత ప్రయత్నించినా కాని నాకు ఇంగ్లీషు సిని


---

''యువకవి అంజనేయులు గారు మరణించినట్లు ఒక వార్తా పత్రికకు వార్త అందింది.

మరుసటి రోజు ఆ పత్రిక పెద్దపెద్ద అక్షరాలతో హెడ్డింగ్ ఈ విధంగా ప్రచురించింది.

''యువ కిపి అంజనేయులుగారి మరణం''

—సారే. శ్యామసుందర్ షిల్లాంగ్-9




మాలమీదున్న అసహ్యాన్ని మాత్రం లక్ష్మి తొలగించలేకపోయింది సావిత్రీ! అందుకే తనొక్కతే వెళ్ళింది.

స్నానాదికాలు ముగించుకొని పడక కుర్చీలో ఏదో మానిరాగం తీస్తూ జ్యోతి చూస్తున్న నాకు హఠాత్తుగా స్పష్టంగా "నమస్కారం" అన్నమాట వినిపించింది. తలెత్తిచూసిన నేను ఆనంద పారవశ్యాలతో మాటాడలేక పోయాను. అందుకు కారణమైన వచ్చిన వారెవరో నీవు ఊహించగలవు సావిత్రీ!

"ఏమిటండీ! నన్నిక్కడే ఉండిపొమ్మంటారా!" అంటూ లోపలికి వచ్చాడు శివరామ్ నవ్వుతూ.

తొట్రుపాటుతో లేచి నిల్చొని కుర్చీ చూపించి "లక్ష్మి లేదండీ. పని మాకెళ్ళింది" అన్నాను.

"తెలుసు. వచ్చింది లక్ష్మికోసంకాదండీ" అన్నాడు అదే చిరునవ్వుతో.

అప్పుడు లక్ష్మి నన్ను వదిలేసి పని మాకెళ్లడంలో అంతరార్థం నాకర్థమైంది. ఈ మధ్య లక్ష్మి నాకు తెలీకుండా కొన్నిపనులు చేస్తుందన్నమాట. సరే రానీ అనుకున్నాను మనసులో.

"ఏమిటండీ! లక్ష్మిని తిట్టుకొంటున్నారా!' నా మనసును చదివినట్లే అడిగాడు.

"అహాః! కాదు. కాఫీ తీసుకొస్తా" అంటూ లేవబోయాను

"ఏమిటండోయ్! మీరు మరీ పరధ్యానంలో ఉన్నారు. పదింటికి కాఫీ ఏమిటండి. భోజనం చేసొచ్చాను" అన్నాడు.

అప్పటికిగాని నా తప్పు తెలిసిరాలేదు. అలా మాట్లాడకుండా కూర్చుండి పోయాను.

"అలా ఎంతసేపు నిల్చుంటారు? కూర్చోండి" అన్నాడు.

పక్కనే ఉన్న స్టూలు ఇవతలకు లాక్కుని కూర్చున్నాను.

"మొత్తంమీద మీలో చాలా మార్పు కన్పిస్తోంది" అన్నాడు అదే చెరగని చిరునవ్వుతో.

నిజానికి నేను కోరుకున్నదీ ఆ ఒక్క మాటే. ఆ మాట వినగానే సావిత్రీఎంతో ఆనందంతో ఉప్పొంగి పోయాను. కాని ఆ ఆనందం కన్పించకుండా సర్దుకుకూర్చున్నాను.

కొంతసేపు నిశ్శబ్దం తరువాత "మిమ్మల్ని విషయం అడుగుతాను ఏమను కోరు కదా" అన్నాను నెమ్మదిగా.

"అడగండి" మామూలుగా అన్నాడు.

ఏమడిగానో అని కుతూహలంగా ఉంది కదూ? ఏమడిగానో తెలుసుకున్నాక రెండవ కలయికలోనే ఇంత చనువా? నమ్మశక్యం కాదు. అనుకోకు సావిత్రీ! అది నాకు రెండో సమావేశంలా లేదు. అది ఏదో జన్మాంతర సంబంధం అనిపించింది.

"మీలో అనేక అగ్నిగోళాలు రగులుతున్నాయని అన్నారుకదా క్రిందటిసారి అవేమిటో నేను తెలుసుకోవచ్చా!" సంశయిస్తూనే అడిగాను.


నవ్వుతున్న మొహం ఒక్కసారేచాల గంభీరంగా మారిపోయింది. ఆ మారిన మొహం చూచిన తరువాత తొందర పడానేమో అనిపించింది. ఒక నిముషం పాటు మా మధ్య నిశ్శబ్దం రాజ్యమేలింది.

హఠాత్తుగా "చెదరిన జీవితంపై మీ అభిప్రాయమేమిటి?" అని అడిగాడు.

ఆ ప్రశ్న నవలనుగురించి అని నే నర్థం చేసుకోవడానికి ఐదు నిముషాలు పట్టింది. తరువాత నెమ్మదిగా, "అది చాలా బాగుంది. కాని కథానాయకుడెప్పుడూ కష్టాల్లో మునిగి ఉండడం అంత బాగోలేదు. ఎవరైనా అలా కష్టాలు ఊపిరి సలపకుండా వస్తాయా? కాని కథానాయకుడి ధీరోదాత్తత నచ్చింది. అన్ని కష్టాలను రచయిత కల్పించినా జంకకుండా సమస్యా పరిష్కారం చేసుకొన్నందుకు అభినందనీయుడు." అన్నాను.

"ఆ సమస్యా పరిష్కారం కూడా రచయిత చేయించితే చేసిందే కదా!" అన్నాడు కుతూహలంగా ముందుకు వంగి.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేక పోయాను. తరువాత మరో ఆనందదాయకమైన విషయం తెలిసింది. అది తెలియగానే నా మనసు పురివిప్పిన నెమలే అయింది. అదేమిటో ఊహించ గలవా సావిత్రీ! ఉహూ.... నీ వల్లకాదు, నేనే చెబుతాను.




"అది నా ఆత్మకథేనంటే మీరేమంటారు?" అడిగాడు శివరామ్.

"అయితే .... ...." అర్ధోక్తిలోనే అనుమానంగా ఆపేశాను.

"అవును. కిరణ్ అనేది నా కలం పేరు. అది వ్రాసింది నే " అన్నాడు. చిరునవ్వుతో.

"మీ ఆత్మకథలు వ్రాసుకుంటే వ్రాసుకోవచ్చుగాని ఇతరుల కథలు వ్రాయడానికి మీకు అనుమతి ఎవరిచ్చారు?" తెచ్చిపెట్టుకున్న కోపంతో అడిగాను.

"కాని సావిత్రీ! నా కక్కడ ఎంతో మధురమైన ఓటమి సంభవించింది.

"నిజంగా నాతప్పంటారా?" సూటిగా నా కళ్ళలోకి చూస్తూ ప్రశ్నించాడు. ఆ కళ్ళలో మెదులుతున్నది చిరునవ్వో. గాంభీర్యమో అర్థంకాకుండానే తలవంచుకున్నాను.

"మీరు నా పిల్లలకు తల్లి కాగలరా?" అని అడిగాడు.

"ఆ మాట వినగానే స్థాణువునైపోయాను. ఏదో చెబుదామని తలెత్తేసరికి అతనక్కడ లేడు. కిటికీ దగ్గర నిల్చొని ఎటో చూస్తూ "మీరు జీవితంలో మోసపోయారనికాని. వయసుమళ్ళినవారనిగాని ఈ కోరిక కోరడంలేదు జానకిగారూ. రెండవ సమావేశంలోనే యింత చొరవేమిటా అనుకోకండి! నేను లక్ష్మిద్వారా

మిమ్ములను గురించి నాకు కావలసిన దానికంటే ఎక్కువగానే తెలుసుకున్నాను. మొదటిసారి మిమ్ములను చూడగానే మీ స్వభావాన్ని అంచనా వేసుకొన్నాను. మీరయితే నాపిల్లలకు పోయిన తల్లిస్థానాన్ని భర్తీచేయగలరని ఆశించాను. నా పిల్లలకా అదృష్టం లేకపోతే యిక వారికి మీలాటి మనిషి దొరకకపోవచ్చు. మీరే కనుక అంగీకరిస్తే నా పిల్లలతోపాటు నేను కూడా అదృష్టవంతుడి నవుతాను. మీ నిర్ణయం ఇప్పుడే చెప్పనవసరం లేదు. తరువాత లక్ష్మి చెప్పినా చాలు. కాని ఒక విషయం మర్చిపోకండి. ఒకవేళ నా జీవితంలోకి ప్రవేశించడం మీ కిష్టంలేకపోతే మనం మంచి స్నేహితులుగానే మిగిలిపోదాం'' అన్నాడు

ఆ మాటలు నా చెవిలో అమృతం పోసినట్లనిపించాయి. నాలో సంఘర్షణ మొదలైంది. నా కుటుంబంకోసం నా జీవితాన్ని త్యాగం చేయడమా లేక నా సుఖంకోసం వారిని వదలివేయడమా? ఏదీ నిర్ణయించుకోలేకపోయాను. చివరకు నా స్వార్థమే జయించింది సావిత్రీ! కాని నేను దాన్ని స్వార్థం అనబోవడం లేదు. ఎందువల్లనంటే నేను నా కుటుంబంకోసం నా సుఖాన్ని త్యాగం చేసినందుకు నన్నేదో అందలం ఎక్కించమని కోరలేదు సావిత్రీ! కాని అలా చేయడం నా విధి అయినట్లు నేను సంపాదించటానికి, వాళ్ల ఖర్చుపెట్టటానికి మాత్రమే భావించే వారిమీద అసహ్యమే నన్నా నిర్ణయానికి పురికొల్పింది.

"అంత సమయం అవసరం లేదు. నేను అంగీకరిస్తున్నాను" నెమ్మదిగా అన్నాను తల ఎత్తకుండానే.

''నిజంగానా జానకీ!'' వెంటనే నా దగ్గరకు వచ్చి గడ్డం పైకెత్తి అడిగాడు.

వెంటనే నాలో ఏదో వివశత్వం కలిగింది. నేను ఉద్యోగరీత్యా ఎందరు మగవాళ్ళతో మాట్లాడినా నేను స్త్రీ ననే సంగతి గుర్తుండేది కాదు. కాని ఆ సమయంలో నాలో స్త్రీత్వం తలెత్తింది. మెల్లిగా పక్కకు తప్పుకొని తలవంచుకు నిలబడ్డాను. అప్పుడప్పుడు అలాంటి దృశ్యాలు సినిమాలలో చూచి అవి సహజత్వానికి భిన్నంగా ఉన్నాయనుకొన్నాను. అలాంటిది అంత వయసున్న నాకు కూడా అదే పరిస్థితి ఏర్పడటం నా కిప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది సావిత్రీ.

అంతలో సుడిగాలిలా లక్ష్మి వచ్చింది. వస్తూనే, 'ఓ? మీరా! ఎంత సేపయింది వచ్చి" అన్నది.

''ఆహా! ఎంత చక్కగా అడుగుతున్నావు తల్లీ! ఏమీ తెలియనట్లు. తరువాత నీ పని పడతానుండు.'' అన్నట్లుగా తర్జనితో బెదిరించాను ఆయన చూడకుండా.

ఇప్పటివరకు ఏకవచనం వాడి ఒక్క

పారే బహువచనం వాడి నందుకు నవ్వు తున్నావా సావిత్రీ ఆ నిర్ణయం తీసు కొన్నాక ఏకవచనంతో పిలవలేకపోయాను ఎందువల్లనో. విశేషమంటే అదే నిర్ణయం తరువాత ఆయన నన్ను బహువచనంతో పిలవలేక పోయారు.

"సరే. మాకు పార్టీ ఎప్పుడు" అన్నది లక్ష్మి నా బెదరింపును చూచి.

"వచ్చే శుక్రవారం లక్ష్మీ. రిజిష్ట్రారాఫీసుకు నీవు కూడా రావాలి. మరి నేను వెళ్తొస్తాను. బజారుకెళ్ళాలి." అన్నా రాయన.

నా కాయన మాటలు వినగానే అంతు లేని ఆనందం కలిగింది. నా కంత తొందరగా విముక్తి లభిస్తుందనుకోలేదు. తరువాత రిజిష్ట్రారాఫీసులో మేము దంపతులం కావడం కలలో జరిగినట్లు జరిగిపోయింది తరువాత బాధలు మర్చిపోవటానికి ఒక్క పదిహేను రోజులు అలా తిరిగి వద్దామనే ఉద్దేశ్యంతో బయలుదేరాము. అప్పుడు పుట్టింది సావిత్రీ నేను లేచి పోయా..' పుకారు. కాని నేను వెళ్ళటాన్ని లేచి పోవటమని అంటావా సావిత్రీ! మరి అలాటి పుకార్ల నెందుకు ఎక్కువ కాని చ్చావు! అవి నీవడగవచ్చు ఆ మాటలు మా ఇంటి దగ్గర వాళ్ళు వినాలి.ఇన్నాళ్ళూ నా సంపాదనమీద ఆశతో నా పెళ్ళి విష యాన్ని కూడా తలవనందుకు అవమా నంతో కుళ్ళి కుళ్ళి పోవాలి. సావిత్రీ! అందుకే నేను లేచిపోయాను సావిత్రీ! లేచిపోయాను. నీ నుండి సానుభూతి నర్థిస్తూ నీకీ విషయం వ్రాయలేదు ప్రపంచంలో నా కున్న ఆప్తులు నీవూ, లక్ష్మి మాత్రమే. అందుకే నీకు తెలియ జేస్తున్నాను. ఇప్పటికీ నేను చెప్పగలను ధైర్యంగా నేను లేచిపోయాను హహ్హహ్హ నేను లేచిపోయాను.

మరి ఉంటాను సావిత్రీ

ప్రేమతో

నీ

జానకి

( 968 జ్యోతి దీపావళి ప్రత్యేక సంచికలో శ్రీ అవసరాల రామకృష్ణారావుగారు "ఎవరితోనైనా లేచిపోకూడదూ" అనే కథను వ్రాశారు. అవే పాత్రలను తీసుకొని శ్రీ పింగళి రంగారావు గారు 1969 జూన్ సంచికలో "ఎవరితోనవి లేచి పోను!" అనే కథను సృష్టించారు, అవి రెండూ చదివిన తరువాత "నేను లేచి పోయాను" అనే కథను అవే పాత్రలతో వ్రాయాలనిపించింది. కాని కొన్ని అని వార్యకారణాల వల్ల వెంటనే వ్రాయడం కుదరలేదు. ఇప్పుడు పూర్తి చేయగలడం చేత ఆలస్యమైనా పంపటానికి సాహసిస్తున్నాం )